క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మియాపూర్: మియాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఓల్డ్ ముంబై రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 12.45 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలపిట్ట పార్కు సందర్శన వేళలు

రాయదుర్గం: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట పార్కు

సందర్శన వేళలు......

- ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు.......

- అడల్ట్స్/కిడ్స్/ఓన్ సైకిల్
- ప్రతి గంటకు రూ.50 చార్జీ

నెలవారీ పాస్ రూ.800 (నెలవారీ చార్జీ)

యువత స్టార్టప్‌లతో ముందుకు రావాలి



ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

గచ్చిబౌలి: టీఎన్‌జీఓకాలనీ ఫేజ్-2లో తెలంగాణ కట్స్ నూతన ఔట్‌లెట్‌ను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. యువత స్టార్టప్‌లతో ముందుకు వచ్చి ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం వారిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ కట్స్ వ్యవస్థాపకుడు బండి హరిప్రసాద్‌గౌడ్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు అనైతికం

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి

పటాన్‌చెరు టౌన్: రాహుల్ గాంధీ సభ్యత రద్దును వెంటనే నిలిపివేసి, తిరిగి పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగింపజేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై కక్షగట్టి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా నరేంద్రమోదీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. వెంటనే రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని పునరుద్దరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, కిషన్, సంతోష్, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులతోనే అభివృద్ధి

మణికొండ: రహదారుల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట 5వ వార్డు కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. తన వార్డు పరిధిలో రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధుల లభ్యతను బట్టి అన్ని వార్డుల్లో సాధ్యమైనన్ని ఎక్కువ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిర్మాణాల్లో అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

చలివేంద్రాలతో సమాజసేవ

మణికొండ: సేవా సంస్థలు, సహృదయులు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలతో సమాజానికి మేలు జరుగుతుందని, అలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డన్‌లో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనుషులకు సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లే అన్నారు., సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేసే వారిని ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, నాయకులు బి.ముత్యాలు, అసోసియేషన్ అధ్యక్షుడు డి.వేణుమాదవ్, కార్యదర్శి డి. భానుచందర్, కోశాధికారి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి10వ తరగతి పరీక్షలు
- విద్య, పోలీసుశాఖ, ఆర్టీసీ విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి



లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

శేరిలింగంపల్లి/రాయదుర్గం: పదవ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో విద్యా, ఆర్టీసీ, పోలీసు అధికారులు సమష్టిగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పరీక్షలు సజావుగా సాగేలా విద్యాశాఖ, ఇలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు, ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు పోలీసు అధికారులు అవసరమైన చర్యలు తీసుకున్నారు. మండల పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కొందరు విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు ఆదివారమే పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

25 సెంటర్లు.. 4,626 మంది విద్యార్థులు..

- శేరిలింగంపల్లి మండలంలో 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 83 ప్రైవేట్ స్కూల్స్‌లో కలిపి 4,626 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకుగాను 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు
- ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఎదుట సీల్డ్ కవర్‌లో ఉన్న పేపర్‌ను తీసేలా ఏర్పాటు చేశారు
- ప్రైవేటు స్కూల్స్‌లో ఇప్పటికే పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఉండగా, తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేశారు.

పరీక్షా కేంద్రాలు ఇవీ

- ఎంఎస్‌ఆర్ ఉన్నత పాఠశాల, నాగార్జున ఉన్నత పాఠశాల, విద్యావాణి ఉన్నత పాఠశాల, న్యూ నేషనల్ స్కూల్ చందానగర్
- అక్షయ ఫౌండేషన్ స్కూల్- నల్లగండ్ల
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శేరిలింగంపల్లి
- విద్యానికేతన్ స్కూల్- తారానగర్
- శారదా విద్యానికేతన్, ది ఇండో ఇంగ్లిష్ ఉన్నత పాఠశాల మియాపూర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మియాపూర్
- కేఏఆర్ విద్యాలయ- మదీనాగూడ
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, న్యూబ్లూమ్ హైస్కూల్, శారదా హైస్కూల్ కొత్తగూడ
- విద్యా హైస్కూల్- అంజయ్యనగర్
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , జీవీఆర్ ఉన్నత పాఠశాల కొండాపూర్
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గచ్చిబౌలి
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్వాతి ఉన్నత పాఠశాల మాదాపూర్
- యునైటెడ్ హైస్కూల్, సేయింట్ ఇసాక్ అడ్వెంట్ స్కూల్ న్యూ హఫీజ్‌పేట్
- రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగార్జున ఉన్నత పాఠశాల రాయదుర్గం

పదవ తరగతి పరీక్ష వివరాలు.....

పరీక్ష సమయం-ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

03-04-2023	సోమవారం	తెలుగు
04-04-2023	మంగళవారం	హిందీ
06-04-2023	గురువారం	ఇంగ్లీష్
08-04-2023	శనివారం	గణితం
10-04-2023	సోమవారం	సామాన్యశాస్త్రం
11-04-2023	మంగళవారం	సాంఘీక శాస్త్రం

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు



పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగేలా, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. పూర్తి స్థాయి వసతులు ఉన్న పాఠశాలల్లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా తాగునీటి సరఫరా, ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాట్లపై సమీక్షించాం. పరీక్షా కేంద్రాలను స్వయంగా పరిశీలించాం. సోమవారం నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ప్రతిరోజూ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తాం.

-కె వెంకటయ్య- మండల విద్యాధికారి, శేరిలింగంపల్లి మండలం

ప్రత్యేక బస్సుల ఏర్పాటు



పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఇంద్రేశంలోని స్కూల్‌కు ఒకటి, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు రెండు బస్సులను కేటాయించాం. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఉదయం నుంచి పరీక్ష ముగిసే వరకు డిపో అధికారులంతా రోడ్లపై ఉంటూ విద్యార్థుల సమయానికి తమ పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూస్తారు. రూట్, సాధారణ ఆర్టీసీ బస్ పాస్ ఉన్న వారికి సాధారణ బస్సులే కాకుండా మెట్రోబస్సులోనూ అనుమతిస్తాం.

-పి శ్రీనివాస్, ఆర్టీసీ డిపో మేనేజర్, హెచ్‌సీయూ డిపో గచ్చిబౌలి

పది పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన, డీఈఓ సుశీందర్‌రావు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఆదివారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎ.శ్రీదేవసేన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా హాళ్లలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని తారానగర్ విద్యానికేతన్ హైస్కూల్, కొండాపూర్, గచ్చిబౌలి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి, ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

పటాన్‌చెరు టౌన్: బాటసారులకు దాహార్తిని తీర్చేవిధంగా చలివేంద్రాలు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సమాజ సేవలో శ్రీ భగవాన్ సత్యసాయి బాబా సేవాసమితి సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం స్ఫూర్తి దాయకమన్నారు. అనంతరం సత్యసాయి బాబా పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, చంద్రశేఖర్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్సా శ్యాంరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఇన్‌స్పెక్టర్ సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దాతలు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయొచ్చన్నారు. దీంతో బాటసారులకు, వాహనదారులకు దాహార్తి తీర్చొచని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శశికాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యాక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకలు ఎల్. రవీందర్, శ్రీనివాస్, నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తూర్పు శ్రీనివాస్, అరుణ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో రూ.8,500 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో రూ.8,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం రాత్రి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనలో మన నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందన్నారు. అభివృద్ధిలో గచ్చిబౌలి డివిజన్ ముందుందని, రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, చెరువుల సుందరీకరణ, లింకు రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని వార్డు స్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేస్తూ, పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు.

నెక్నంపూర్ చెరువులో ఫ్లోటింగ్ బైక్

మణికొండ: చెరువులో చేరే మలినాలతో జీవరాశులకు ఇబ్బంది కలగకుండా వాటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేసేందుకు గాను మణికొండ మున్సిపాలిటీ నెక్నంపూర్ చెరువును దత్తత తీసుకున్న ధ్రువాన్ష్ ఎన్‌జీవో సంస్థ మరో కొత్త యంత్రాన్ని ప్రవేశపెట్టింది. గతంలోనే చెరువు నీటిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచే క్రమంలో ఫౌంటేన్, ఫ్లోటింగ్ ఐలాండ్ తదితర ప్రయోగాలు చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో సదరు సంస్థకు మున్సిపాలిటీలు, హెచ్ఎండీఏ ఇస్తున్న నిధుల్లో కోత పెట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా చెరువులో తిరుగుతూ నీటిని శుద్ధి చేసే ఫ్లోటింగ్ బైక్‌ను ప్రవేశపెట్టారు. పెగాసిస్ సిస్టమ్స్ సంస్థ దీనిని అందజేసినట్లు ధ్రువాన్ష్ ప్రతినిధి మధులిక చౌదరి తెలిపారు.



కరెంట్ కట్ చేసి పన్నులు వసూలు చేస్తారా?

- మున్సిపల్ మేనేజర్‌పై పలు కాలనీల వాసుల ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- ఆల్‌కాలనీస్ ఫెడరేషన్‌లో తీర్మాణం



సమావేశంలో పాల్గొన్న ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ కార్యవర్గ ప్రతినిధులు

మణికొండ: ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు తొలగించి పన్నులు వసూలు చేసిన మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డిపై ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటు ఇంటి పన్ను మదింపు విదానంలో ప్రస్తుతం కడుతున్న పన్నును వంద శాతం దాటి పెంచితే హైకోర్టును ఆశ్రయించాలని తీర్మాణం చేసింది. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ రెసిడెన్షియల్ అసోసియేషన్స్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం పుప్పాలగూడ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ కమ్యూనిటీహాల్‌లో అధ్యక్షుడు డి.సీతారాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిత్రపురి కాలనీలో మున్సిపల్ మేనేజర్ ఇంటి విద్యుత్ కనెక్షన్లను తొలగించి చేసి మరీ ఇంటి పన్నులు వసూలు చేయటంపై సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. మున్సిపాలిటీ పరిధిలోని వార్డు కమిటీలు, పార్కు కమిటీల కూర్పు వాటి నిర్వహణపై మున్సిపల్ చట్టాన్ని అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో చేపట్టిన రోడ్ల వెడల్పు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు ఫుట్ పాత్ ఆక్రమణలను పూర్తిగా తొలగించాలన్నారు. పండెన్‌వాగు నాలా ఆధునికీకరణను పంచవటి కాలనీ నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు చేపట్టాలని కోరారు. ప్రతి ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తీర్మాణించారు. సమావేశంలో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, అలకాపూర్ టౌన్‌షిప్ అధ్యక్షుడు రామయ్య, కార్యదర్శి మోహన్‌లతో పాటు పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి తదితరులు

మియాపూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మంజుల రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆర్‌పీఏలకు యునైటెడ్ వై ఇండియా నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్ బయోటెక్ సౌజన్యంతో టైఫాయిడ్ వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. ప్రజలందరూ బాగుండాలని కాలనీలు, రహదారులపై చెత్త, నిర్మాణ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతారన్నారు. వారు ఆరోగ్యంగా ఉంటేనే కాలనీలు, బస్తీలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె డివిజన్ పరిధిలోని వేముకుంటలో సీసీ రోడ్డు పనులు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. చందానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించిందన్నారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. నాణ్యత విషయంలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



శిల్పారామంలో అలరించిన భరతనాట్యాంశాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రీవారి పాదాలు భరతనాట్యం డాన్స్ అకాడమీ గురువు నల్ల రమాదేవి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన చేశారు. ఇందులో పుష్పాంజలి, మైసూర జాతి, సుబ్రమణ్యం కౌతం, అన్నమయ్యకీర్తనలు, వర్ణం, కావడిచిందు, తదితర అంశాలను కళాకారులు దుర్గ, శ్రిత, శృతి, ఆకృతి, నవీన, వర్ష, అస్మిత, అనుశ్రీ, ప్రగతి, శివాని, సంహిత, వైష్ణవి, అదితి, కేసి, ఎస్విత, సామృత ప్రదర్శించారు.

ఇంటింటికీ రక్షిత మంచి నీరు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



బిందెలో నీటిని నింపి మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రారంభించారని, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పదో వార్డు సాయికాలనీలో సాయధామం అపార్ట్‌మెంట్‌లో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మూడు భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని, త్వరలోనే పూర్తి చేసి ప్రతి ఇంటికీ మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు మంచినీటి ఎద్దడికి అమీన్‌పూర్ చిరునామాగా ఉండేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రతిరోజు మంచినీరు అందించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ బోయిని బాలమణి బాలరాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, తహసీల్దార్ దశరథ్ ఉన్నారు.